పొరపాటు

చ. రా.

హఠాత్తుగా వెళ్లి నామిత్రులకు నా రాక చేత ఆశ్చర్యము కలిగించడము నాకు మహా సరదా. ఆనేళ శనివారము. పొద్దుపోకపోతే హాస్టలునుండి శారద యింటికి మూడు గంటలకే వెళ్లాను. శబ్దము చేయకుండా హాల్లో ప్రవేశించాను. ఒక మూలలలో ఆంధ్రపత్రిక ముఖాని కడ్డంగా పట్టుకొని శారద కూర్చునివుంది.

తిన్నగా వెళ్లి శారద వెనుకనుంచున్నా. నా రాకచేత శారదకు ఎంత ఆశ్చర్యము కలిగించాలని అనుకొన్నానో శారద ముఖము చూసేటప్పటికి నా కంతకంటె ఎక్కువ ఆశ్చర్యము కలిగింది. శారద పత్రిక చూస్తూ కన్నీరు కారుస్తూవుంది. ఎంతసేపటినుండి ఆలా దుఃఖిస్తుందో ఏమో గాని కళ్లుమాత్రము ఎఱ్ఱబారివున్నాయి.

నాచేతులు మెల్లగా శారద భుజాల పైన వుంచాను. వులికిపడి శారద కళ్లు పైకెత్తి నావైపు చూచింది.

'అక్కయ్యా! వచ్చావూ? ఇలా కూర్చో. ఇదో ఇది చూడు.'

కన్నీళ్లు తుడుచుకుంటూ ఆదుర్దాతో పత్రిక నాచేతి కిచ్చింది.

శారదస్థితి నా కేమీ అర్థమైంది కాదు.

'ఏమిటది?' అని తిన్నగా అడిగాను.

'నీవే చూడమ్మా!' అంది కష్టము దీనత్వమూ పైకి కనిపించేటట్టు.

నేను ముంగురులు సవరిస్తూ 'ఏమిటో చెప్పుదూ' అని బుజ్జగించాను.

'అబ్బా! చూద్దూ తరువాత చెపుతాను' అని పత్రికలో ఒక చోట చూడమంది.

నా కదేమిటో చూడాలనివుంది కాని శారద ముఖములోని దీనభావము ఆవిడ ఆందోళనా నాదృష్టినంతా ఆకర్షించాయి. పత్రిక చూచాను ఒకచోట

"నూరు రూపాయల స్థిరమైన ఉద్యోగము. పాతికేళ్ల పట్టభద్రుడు. ఈ బ్రాహ్మణయువకునికి రూపవతి విద్యావతి సంగీతపరిజ్ఞానము గల పదహారేళ్లకు లోబడిన వధువు కావాలి. బాలవితంతువైనా సరే. వివరాలకు—"

అని వుంది.

నే నది చదువుతూవుంటే నా ముఖమే చూస్తూవుంది శారద.

'దీనిలో ఏముంది దుఃఖించడానికి?'

'ఇదెవరు ప్రకటించారో తెలుసా?'

'ఎవరో స. నా. గారట?'

'అంటే—?'

'నాకుమాత్రం తెలుసా ఎవరో?'

'ఔను మరి ఏలా తెలుస్తుంది?'

'బాగావుంది. ప్రపంచములోనివారంతా నాకు తెలిసివుండాలా?'

'మరి ఎఱిగినవారినే తెలియదంటే ఏమనాలి?'

'పోనీ యీ రాద్ధాంతమెందుకు? నీవే చెప్పకూడదూ!'

'చెప్పడాని కేముంది ప్రత్యక్షంగా తెలుస్తూవుంటే. క్రిందవుండే వూరైనా వారెవరో తెలుపడములేదా?'

'వూరుమాత్రము మావూరే. అయితే ఎంతమందో మావూళ్లో స. నా. గారలు.'

'ఔ నౌను. నూటడెబ్భైపదుకొండు మంది'

నేను లోలోపలనే నవ్వుకున్నాను. అవి పొడిఅక్షరాలైనా శారద హృదయములోని వ్యక్తికి సంబంధించి వుండవలసిందనే ఆవిడ అభిప్రాయము.

'అంతకోప మెందుకూ? వారు సత్యనారాయణరావుగారనేనా?' అన్నాను.

'కాక మరెవరు?'

మబ్బుల్లో మరుగైయున్న చంద్రబింబం ఓమారు బైటికివచ్చింది. శారద ముఖాన ఒక చిరునవ్వు వెలిగింది. కళ్లు భూమిని చూశాయి.

'పోనీ ఆయనే అనుకుందాం. ఇలా వారు ప్రకటించుకుంటే నీ కేం?'

'పో! అక్కయ్యా! నీ వెపుడూ ఇంతే.'

చంద్రమండలాన్ని మరల మబ్బులు ఆక్రమించాయి.

'ఇహ ఈ పిచ్చివేషాలు చాలించు' అని దగ్గరకు లాక్కున్నాను.

'నిజంగా నా అదృష్టము బాగుంటే ఇదంతా ఏమిటి?'

'ఈ ప్రకటనవారు చేసిందో కాదో. పరిచయముతప్ప,నీసంగతి ఆయనకు చెప్పిన వారెవరూలేరు, ఆయనమాటా యివ్వలేదు. ఆయన ఇప్పటి వుద్దేశ్యము ఏమో? ఏమీ తెలీక లేనిపోనివన్నీ వూహించుకొని యీలాదుఃఖించడము నాకేమీ నచ్చడము లేదు.'

'... ....'

'పోనీ, నే నీమారు సెలవుల్లో మా వూరు వెళ్లినపుడు 'ఆయన్ని ప్రత్యక్షముగా అడిగి కనుక్కొంటాను. అంతవఱకు ఓపిక పట్టాలి మరి.”

'అదికా దక్కయ్యా! వారిప్రకారము మంచివా రెవరైనా దొరికితే—'

అబ్బ! ఇంత అవసరమూ ఆతురత ఎందుకో!

'దొరికితే పెళ్లిచేసుకుంటారు నీ కేం?' అన్నా కొంచము విసుగుతో.

'నిజమే మరి' అంటూ గబగబా మేడ మీదికి వెళ్లిపోయింది. వెలికివచ్చినది యీ చిన్నముక్కే అయినా దీల్లో ఒక ప్రేమ పూరితహృదయము తన అభిప్రాయాన్నంతా పైకి ఉబికించింది. ప్రేమఫలిత మీలాగేవుంటుందనీ, తానొకరికి సంపూర్ణంగా అర్పించిన జీవితము దుఃఖమయమైపోయిందనీ, పవిత్రప్రేమతో తప్ప మరే విధముగా ఆకర్షించే గుణాతిశయాలు తన దగ్గర లేనందువలన తనప్రేమ ఫలించి జీవితములో తనకు ఆనందము అనేది లభించుట అసాధ్యమనీ ఆ ముక్కలోనే

ధ్వనించాయి. నాకుచేతగాదుగాని ప్రణయ శాస్త్రపారంగతు లెవరైనా ఆ ముక్కను ఆ ధోరణిలో వినివుంటే దానికి ఎన్ని అర్థాలు, ఎంత వ్యాఖ్యానము చేసి వుందురో ?

నేనూ వెంటనే పైకివెళ్లాను. శారద మేడమీద గదిలో మంచముపైన పడుకొని వెక్కివెక్కి ఏడుస్తూవుంది. దగ్గరకు వెళ్లి ఎంతో వూరడించాను. ఎంతో ధైర్యము చెప్పాను. కాని ఆవిడ దుఃఖ ప్రవాహ మాగిందికాదు. నాకుకూడా కళ్లల్లోనుండి ప్రవాహాలు బైలుదేరాయి. ప్రేమచే నిండిన హృదయానికి కన్నీటి కాలవలు సన్నిహితబంధువులు.

మేడమీది కెవరో వస్తున్నట్లు చప్పుడైంది. శారద లేచికూర్చుంది. ఇరువురు కళ్లు తుడుచుకున్నాము. ఇంతలో పని మనిషి వచ్చి ఏదో తీసుకొని క్రిందికి వెళ్లింది.

'శారదా! ఎందుకమ్మా ఆలా దుఃఖిస్తావు. చెప్పానుగదూ నేను ఆయనతో మాటాడుతానని.'

'ఏదో దుఃఖ మాలాగవచ్చింది. మరేమీలేదు.'

'నాకు తెలుసు నీ హృదయమేమిటో. అంతకైతే మీ నాన్నగారితో ఈవిషయము చెప్పి రావు సంగతేమిటో కనుక్కోమన్నా?'

'ఊహూ...'

'అయితే నేనే మాటాడుతానులే.'

'ఏలాగ?'

'ఏదో ఏకవిధముగా. నీవిషయమంతా చెప్తాను. ఆయన ముందు అభిప్రాయాలతో నేవున్నారో, నీవిషయము ఎందుకు విచారింపకూడదో అడుగుతాను.'

' .... '

'ముందు కృష్ణవేణి విషయములో లాగే ఈ ప్రకటనలోకూడా యితరుల బలవంత ముందేమో తెలిసికోవాలి.'

'వా రింకా కృష్ణవేణి విషయమై ప్రయత్నిస్తున్నారని నాతో పద్మ మొన్న అంది.'

'నిజమే. వారి భగీరథప్రయత్నాలకు ఆయన 'సనేమిరా' గారైవున్నట్టుంది.'

'ఏమో వారివారి అదృష్టం.'

'కానీ నీవుమాత్రము ఈలా దుఃఖించ వద్దు. శరీరం చెడుతుంది. నీ కింకా చదువే నాలుగేళ్లుందే. మధ్యలో ఈపిచ్చి నీ కెక్కడ దాపురించిందమ్మా!'

'ఔను. తనకు అనుభవములేకపోతే సరి. ఇతరులది పిచ్చ క్రిందికే వస్తుంది.'

శారదను సంతోషపెట్టి ఆవిషయాన్ని మరిపించి వెళ్లడానికి నాకా సాయంకాలము ఎనిమిది గంటలైంది.

* * *

నేనూ శారదా ఏలగ్నములో కలిసికొన్నామోగాని మాయిద్దరికీ ఏకోదరుల

కంటె ఎక్కువ చెలిమి ఏర్పడ్డది. శారద మా స్కూల్లో చేరినపుడు ఏడేళ్ల అమ్మాయి. నేనూ ఆవిడ అక్కచెల్లెండ్ర లాగ ఆడుకునేవాళ్లము. ఆచిన్ననాటి చెలిమే రానురాను చాల గాఢమౌతూ వచ్చింది.

శారద కిపుడు పద్దెనిమిదేళ్లు. నాకంటె ఐదేళ్లు చిన్నది. ఆవిడసౌందర్యాన్ని గుణాతిశయాలని నే నిపు డేమీచెప్పను. మిత్రులోకరినిగురించి ఒకరు ఏమిఅన్నా అది అతిశయోక్తి ఔతుంది. అయినా ఆమె ఉద్యానవనములో అధిక ఆదరముతో పెంపబడిన ఒక సుందరలత అనిఅనవచ్చును.

ఇపుడు శారద ఇంటర్ సీనియర్ చదువుతూంది. మాతృమూర్తి ఆమెకు చిన్నపుడే దూరమైనందున తండ్రి ఎంతో గారాబముగా పెంచేవారు. పి. ఆర్. కాలేజీకి దగ్గరగానే వారి యిల్లు.

మా తండ్రిగారికి శారద తండ్రి రమణరావుగారికి అమితమైన స్నేహం. రమణరావుగారు మావూరికి మానాన్నకోసర మెన్నోమార్లు వస్తూవుంటారు. ఒకమారాలా వచ్చినపుడు మా నాన్నగారు సత్యనారాయణరావుగారితో మాట్లాడుతున్నారు. ఆయన మా నాన్నగారి ఆఫీసులోనే ఉద్యోగి. మా నాన్నకు ఆయనంటే ఎంతో అభిమానము, అతను తరచుగా మా యింటికి వస్తూవుండడమువల్ల మేము చనువుగావుండేవాళ్లం.

రమణరావుగారికి మా నాన్నగారు సత్యనారాయణరావును ఎఱుక చేశారు. ఎప్పటిలాగే రావు గుణగణాలనీ ఉన్నతాశయాలనీ ఎంతో శ్లాఘించారు. తరువాత వారందరు గలసి లోకాభిరామాయణము చాలవఱకు మాట్లాడారు. ఆ మరుదినము రమణరావుగారు వూరికి వెళ్లారు.

ఒక సాయంత్రము సత్యనారాయణరావు వస్తే పెళ్లిప్రసంగాలలోనికి దింపారు మా నాన్నగారు రతన్ని. రమణరావుగారు తన కూతురిని సత్యనారాయణరావుకు ఇవ్వాలని సూచించారనీ ఆసంబంధము అన్నివిధాలా ఉత్కృష్టమైనదనీ మా నాన్నగారు ఆయనతో చెపుతుంటే నా కమితమైన ఆశ్చర్యమేసింది. పైగా శారద ఎటువంటిదో మా నాన్నగారు నన్ను చెప్పమన్నారు. నే నావిడను బట్టుమూర్తిలా పొగడాను. అన్నీవిని సత్యనారాయణరావు 'ప్రసాదరావుగారూ, మీరు చెప్పిన సంగతులు వినడానికి ఎంతో సంతోషము కలుగుతూవుంది. నా మేలుగోరి మీరిటువంటివి తలపెట్టడము నా అదృష్టమే. కాని వివాహవిషయాల్లో ప్రకృతం నా మన స్సెంతమాత్రమూ చొరడములేదు. క్షమించండి' అని తన అభిప్రాయము వెల్లడించారు. మాతండ్రికి, వారివల్ల ఆవార్తను విన్న రమణరావుగారికి చాలా ఆశాభంగం కలిగింది. అపుడు శారద ఫిఫ్తుఫారము చదువుతూ వుంది.

కొంచముకూడ ఈవిషయము శారదకు తెలియదు. తరువాత రెండుమార్లు సత్యనారాయణరావు కాకినాడ వస్తాంటే

మానాన్నగారు నన్ను చూచి రమ్మన్నారట. ఆ రెండుమార్లు వారు నన్ను చూడవచ్చినపుడు శారదకూడ నాతో మాట్లాడుతూ హాస్టలులోనే వుంది. ముగ్గురుకలసి లోకాభిరామాయణము మాట్లాడాము. అపుడే కనుక్కొన్నా ఆయనంటే శారద కొకవిధమగు గౌరవము కలిగిందని. అందులో విచిత్రముకూడా కనిపించలేదు. ఎందుకంటే సత్యనారాయణరావుతో ఎంత స్వల్పకాలము మాట్లాడినవారెవరైనా వారి సుహృద్భావాన్ని కనిపెట్టి ఆకర్షింపబడుతారు; గౌరవించుతారు.

ఇది జరిగినతరువాత ఒకమారు నేను శారదకు మావూళ్లో జరిగిన పెళ్లిప్రసంగము పెద్దల ఆశయాలు చెప్పాను. శారదకు ఆ విషయము చాల సంతోషాన్ని కలిగించినట్టు తోచింది. ఎందుకంటే ఆనాటి శారద ప్రశ్నపరంపరలకు నాకు సరియైన ఉత్తరాలివ్వడమే కష్టంగా కనపడింది. సత్యనారాయణరావు ఆనాడు చెప్పిన అభిప్రాయాన్ని నేను స్పష్టంగా తెలియజేసినా శారద దానిని గమనించినట్టు కనపడదు.

ఇది ఇలావుండగా ఇంకోవిశేషము జరిగింది. మా సీనియర్ బి.ఎ. తరగతిలో కృష్ణవేణి అనే అమ్మాయి వుండేది. ఆమెను తండ్రి బలవంతాన సత్యనారాయణరావు వచ్చి చూచి వెళ్లారు. అది నాకు శారదకు కూడా తెలుసు.

దీని తరువాత శారదకు హఠాత్తుగా ఒక జబ్బువచ్చింది. చదువు సాము మానేసి తిండి తీర్థాలు దూరముచేసి ఎక్కడ కూర్చుంటే అక్కడే, ఎక్కడ పడుకుంటే అక్కడే బిక్క ముఖమువేసుకొని యేదో దీర్ఘముగా ఆలోచిస్తూ వుండేది. తలచుకొన్నపుడంతా తలనొప్పి జ్వరము తయారు. పరీక్షరోజులు కాబట్టి కాలేజికి రాకపోయినా ఇబ్బంది కలగలేదు. రమణరావుగారు డాక్టరువద్ద చూపించారు కానీ వారి కారోగము ఏమిటో తెలియక చదువు వలన గలిగిన బలహీనమంటూ 'డయాగ్నైజ్' చేసి యేదో ఔషధమిచ్చారట. సత్యనారాయణరావు కృష్ణవేణి విషయములో మారుమొగము పెట్టారని మాకు తెలిసేటంతవరకు శారద జబ్బు తీవ్రత తగ్గిందికాదు. దాని సంగతి అపుడే నా కవగాహమైంది. తరువాత కూడా ఆజబ్బు అపుడపుడూ వస్తూవుండేది.

మా యిరువురి పరీక్షలూ ముగిశాయి. రమణరావుగారి అనుమతితో శారదను మావూరు పిలుచుకొని వెళ్లాను. మావూళ్లో శారద పదిహేను రోజులుంది. ఆ రోజుల్లో కూడా ఎప్పటిలాగే సత్యనారాయణరావు మాయింటికి వస్తూవుండేవారు. వారితో నాకున్న చనువు కొద్దీ ఎన్నోవిషయాలు మాట్లాడేదాన్ని, ఒక్కొక్కపుడు శారద కూడా సంభాషణలో పాల్గొనేది. వారిరువురి హృదయాల్లో ఏముందోకాని వారేమీ యెఱుగని కొత్తవాళ్లలాగే మెలగేవారు.

ఇది సుమారు రెండేండ్లక్రిందట విషయము.

సత్యనారాయణరావునుగూర్చివిని ఆయన గుణాతిశయాలచేత ఆకర్షింపబడి అప్రయత్నముగా శారద తన హృదయాన్ని ఆయనకు అర్పించిందో, లేక తన తండ్రిగారే వారితో పెళ్లిపెత్తనం చేశారుకదా, వారు దాని కంగీకరింపకపోయినా అభ్యంతరము చెప్పలేదుకదా అనేమైనా వారిని ప్రేమించిందో చెప్పడానికి వీల్లేదు. ఇంతకూ ప్రేమించే వాళ్లకు కారణమంటూ ఒకటుంటుందా ?

* * *

ఒక హృదయాన్ని విప్పి అందలి విషయాలని విస్పష్టంగా చదవడానికి మిత్రత్వమునకు వున్నంతశక్తి మరియే 'అత్వమునకు' వుండదు. తండ్రికి కాని తదితరులకుగాని విప్పని తన హృదయాన్ని శారద నాకు స్పష్టపరచింది. ఈ పరిస్థితులలో తన జీవితసమస్య ఏమాతుందో ఏమో అని దుఃఖించేది. అసలే శారదంటే నా ఆరవప్రాణము. ఆస్థితిలో ఆమె ఆలాదుఃఖిస్తుంటే నేనెలాగైనా ఆమె మనోరథము సిద్ధింపచేయాలని దృఢము చేసుకున్నా.

సెలవులువచ్చాయి. ఎంతో కష్టమయింది శారదను విడిచిపోవడానికి. సత్యనారాయణరావుకు నేనంటే ఎంతో అభిమానము దయా కూడ. అంచేత ఆయని ఎలాగైనా ఒప్పించడానికి ప్రయత్నిస్తానని పాపము శారదకాశపెట్టి బైలుదేరాను మావూరికి. కాని శారద సందేహమే నిజమైతే సత్యనారాయణరావు వేరువిధముగా ప్రత్యుత్తరమిస్తే తరువాత గతేమిటి అనిపించింది. ఈతలంపు నాకతిభయంకరముగా తోచుటచేత మరీ దాన్ని నా మనసులోనికి రానివ్వలేదు.

యథాప్రకారముగా సత్యనారాయణరావు మా యింటికి వస్తున్నా నాకాసంగతి ప్రస్తావించడానికి ధైర్యము, తగిన అవకాశము కలిగిందికాదు. ఒక ఆదివారము మా నాన్నగారు లేనపుడు ఆయనవచ్చారు.

'అమ్మాయీ ' నాన్నగారున్నారా ?' ఆయన నన్నాలాగే పిలిచేవాడుక.

'లేరన్నయ్యా! ఎక్కడకో వెళ్ళారు.

'ఇపుడువస్తారా తిరిగి ?'

'తెలియదు.'

'మరలవస్తాను. వారువస్తే—'

'ఎందుకు కొంచంసేపుండండి నేను మీరువస్తే బాగుండు ననుకొంటూవున్నా.'

'ఏమిటమ్మా విశేషాలు ?'

'ఏమీలేదు కాని ఒకవిషయము మిమ్మల అడగ దలచుకున్నా.'

'అలాగా! అయితే చెప్పమరి.'

'మీరు కోపగించుకొనకపోతే—'

'ఇదేమిటి ? ఈవేళ కొత్తవిషయము?'

'మేడమీదకు వెళుదాంరండి చెపుతాను.'

'అంత రహస్యమా?' అన్నారు పైకి లేస్తూ.

'రహస్యంకాదుగాని అక్కడ ప్రశాంతంగా మాటాడుకోవచ్చు.'

మేడమీదికివెళ్లి డాబామీద కూర్చున్నాము.

'ఏమిటో కానీమ్మా'అని ఆయనే ప్రారంభించారు.

కొంచము సందేహించాను అది గ్రహించి 'సంకోచమెందుకు నేనేమి కొత్త వాన్నా?'అన్నారు.

'రమణరావుగారు మీకు జ్ఞాపకమున్నారా?'

'ఏ?—'

'కాకినాడ. మానాన్నగారివద్దకు పలుమారు వస్తుంటారు. సుమారు మూడేళ్ల క్రింద—'

'ఓహో! వారా! ఔను జ్ఞాపకముంది.'

'శారద ఆయనకుమార్తె. ఆఅమ్మాయి నా ఆరవప్రాణం—'

'మీస్నేహితము నాకు తెలియక పోవడమేమిటి?ఆవిడను నేను బాగా యెఱుగుదును. మంచి అమ్మాయి. కాని నీవు సమయము చిక్కినపుడల్లా ఆ అమ్మాయి స్తుతిలోనికి దిగకుండా వుండలేవు.'

'ఆమె అటువంటిది కాబట్టి. ఆమె హృదయము నాకు బాగా తెలుసు. ఆమె కొక గొప్ప చిక్కువచ్చిందిపుడు.'

'పాపం! ఏమిటది, పరీక్షలో సరిగా వ్రాయలేదా?

'చక్కనే వ్రాసింది, పాసుకూడా అవుతుంది. కాని అంతకంటె గొప్ప పరీక్ష ఆవిడ నెదుర్కుంది. దానిలోనెగ్గడానికి మీ సహాయం తప్పనిసరి. కాని మీరేమంటారో?'

'ఏమంటాను? నాశక్తి సామర్థ్యాలన్నీ ఉపయోగించైనా సాధ్యమైనంత సాయము చేస్తాను. నాసంగతి నీకు తెలియదేమిటమ్మా! ఏమిచేయాలో చెప్పు.'

'శారదహృదయాన్ని ఓ మహానుభావుడు దొంగలించాడు. అదెలా జరిగిందో ఆవిడకు తెలియదట. ఆయనకంతకంటె తెలియదు. రమణరావుకు మాత్రము ఆయనకు శారద నిచ్చి పెళ్లిచేయాలనివుంది.'

'విచిత్రంగావుందే. అయితే ఇపుడిక కావాలసిందేమిటి?'

'రమణరావుగారు పెళ్లివిషయమాయనతో ప్రస్తావించి మూడేళ్లయింది అపుడు పెళ్లి అక్కరలేదన్నారట. తరువాత ఎవరూ వారి నడగలేదు. ఈ సంగతి తెలియక పోయినా శారద ఆయనను ప్రేమించింది. వారిపుడు అంగీకరిస్తారో లేదోఅని భయపడుతూవుంది.'

'ఈ సంగతి ఆయనకుచెప్పి ఆయనను ఒప్పించడము మంచిది.'

'అందుకే మీ సహాయము. ఆయన ఇపుడు కన్యకోసరము వెదకుతున్నాడు కూడా. ఆయనతో మాట్లాడి మీరు దీన్ని ఎట్లాగైనా అంగీకరించేటట్టు చూడాలి.'

'తప్పకుండా. అటువంటి అమ్మాయి కోరితే ఆయన నిరాకరింపడనుకుంటాను.

ఆయ నెవరో చెప్పితే వెంటనే ప్రయత్నిస్తాను.'

'మీరు చెప్పినంత సులభముగా చేయలేకపోతారేమో అనే నాభయము. అందుకే మిమ్మింతగా ప్రార్థించడము. ఆయన ఇపుడు నిరాకరిస్తే శారదజీవితము దుఃఖభాజనమౌతుంది. ఎల్లాగైనా మీ రాయన్నీ ఒప్పించితీరాలి.'

'ఒప్పిస్తాను. నా సాహసమంతా ధారపోస్తాను. ఇంతకు ఆయన్ను శారద అంతగా ప్రేమించిందా ?'

'అనే నాఅభిప్రాయం. లేకపోతే ఇదంతా ఎందుకు ?'

'ఆయన ఇష్టముతప్ప ఇతర ఆటంకాలు ఏమీలేవుకదా.'

'లేవనే అనుకుంటాను. వుండినా వివాహం జరగకపోతే శారద ఎంతగా—' నాకళ్లల్లో నీళ్లుతిరిగాయి.

'ఎందుకమ్మా వ్యసనపడడము ? కార్యసాధనానికంటె రాగాలుతీయడానికి ముందంజవేస్తారు మీరెపుడూ. ఆయనెవరో చెప్పు. ఈవిషయము ఆయనకు చెప్పి త్వరగా తేల్చుకుంటే మరీమంచిదిగదా.'

'మంచిదే కాని శారద తండ్రితో తన సమాచారం చెప్పదు. కూతురింకా చదువుతూందిగదా అని తండ్రి ఆ సమాచారన్ని శ్రద్ధవహింపరు. శారద ఈవిషయంలో ఎంత మాత్రమూ సాహసించలేదు. కాని ఆయన తనను నిరాకరించి ఎక్కడైనా వివాహము చేసుకుంటారేమో అని ఎపుడూ భయపడ్తుతూవుంటుంది.'

'తనమనసువిప్పి యితరులకు తప్పని సరిగా చెప్పవలసివచ్చినపుడు చెప్పకపోతే తరువాత జీవితమంతా దుఃఖింపవలసివస్తుంది. ప్రతివారికీ తనజీవితము సౌఖ్యకరముగా చేసికోడానికి కొంతసాహసము వుండితీరాలని నా అభిప్రాయం.'

'మంచిమాటే అన్నయ్యా! మీరీకార్యం తప్పకుండా చేస్తానంటారుకదూ ?'

'బాగుంది. ఆయనెవరో చెప్పకుండానే ?'

'చెప్పడానికేముంది. ఆ మహానుభావులు మీరే.'

'ఆఁ!' అన్నారు.

నామాటలాయన్ని బొమ్మనుచేశాయి. రెప్పలార్పకుండా నావంకకే చూస్తున్నారు.

'అన్నయ్యా! ఎందుకంత ఆశ్చర్యం.'

'అమ్మాయీ! ఇవినిజమా పరిహాసమా.'

'నిజము. నాతోడు! ఏమన్నయ్యా! ఏమంటావుమరి.'

నాకు ఆతురత హెచ్చయింది.

'అనడానికేముంది. నా హృదయములో పెళ్లివిషయాలు సంచరించకముందు రమణరావుగారు దీన్ని ప్రస్తావించారు. అంతే.

తరువాత శారద ఆలా అయిందని నాకెంత మాత్రమూ తెలీదు. ఇంతకూ ఇపుడు ఏంచేయమన్నావు ?'

'ఏమిచేయమంటూనా! మీకర్పించివుండే ఒకపవిత్ర హృదయాన్ని సుఖపెట్టమంటాను. దీనికేమి అభ్యంతరముంది? వధువుకావాలని మొన్న ప్రకటించారుకూడా.'

'అయ్యో పిచ్చితల్లీ! అదేనా ఇంత చేసింది? నా మిత్రుడొకడు నూరురూపాయల వుద్యోగంలోవున్నాడు. అతడూ పట్టభద్రుడే అతనికోసరమై ప్రకటనచేస్తూ క్రింద నా పేరువేయమన్నాడు. అంతే.'

'అయితే వధువు మీకు కాదన్నమాట.'

'కాదని చెప్పడము లేదా!'

నా హృదయముమీద ఓపెద్దభారము తగ్గినట్లయింది శారదకీవిషయము తెలిస్తే ఎంతసంతోషిస్తుందో అనుకున్నా.

'మరీమంచిదన్నయ్యా' నామాటవినరూ? శారదను ఇపుడో చదువుముగిసినతరువాతనో పెళ్లిచేసుకోరూ? అభ్యంతరమేముంది?'

'కొత్తదేమీ అవసరములేదు. వున్నదే చాలు.'

'ఏమిటది?'

నాకుభయమేసింది.

'ఇంకా తెలియదూ? నాపెళ్లిజరిగి ఏడాదికిపైన అయింది. పరస్పర మిష్టపడే చేసుకున్నాము. తలవనితలంపుగా తటాలున జరిగినందున చాలమంది కది తెలియకనేపోయింది. నీవప్పటినుంచి యీవూరువచ్చి రెండురోజులు మాత్రముండి వెళ్లావు కాబట్టి నీకుకూడా తెలియదేమో? మీనాన్నగారైనా చెప్పలేదా?'

నాకు కొండవిరిగి మీదబడ్డట్టయింది. ఆశ్చర్యముకంటె దుఃఖముపొర్లివచ్చింది. అది కలా నిజమా అంటూ నిర్ఘాంతపోయి చూస్తున్నా. నాప్రయత్నమేమైంది? శారదగతి ఏంకావాలి? అనే ఆవేదనే నన్ను యమయాతనపెట్టడానికి ఆరంభించింది.

'క్షమించండి అన్నయ్యా' తెలియక అడిగాను' అన్నా దుఃఖమాపుకుంటూ

'మీరే క్షమించాలి నన్ను. నే నీవిషయములో ఏమీచెప్పదలంచుకోనలేదు. చెప్పదగినదికూడాలేదు. కాని మీకీచింత కలిగించినందుకు నాకు చాలవిచారంగావుంది.' అన్నారు. ఆయన మాటలలోనే మనోవేదన తెలిసింది. ముఖమంతా వాడిపోయింది. ఇక అక్కడ నిలువలేక మరుమాటాడకుండా వెళ్లిపోయారు.